క్లుప్తంగా

పశ్చిమలో రెండు నామినేషన్లు

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జోన్-5 పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదారి ఆనంద్‌కుమార్ రెండు సెట్లు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా వెంకట్ గణేష్ ఓ సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో రమాకుమారి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు గబ్బర్‌సింగ్ తన మిత్రులతో కలిసి పార్టీలో చేరగా..వారికి యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి కండువాలు వేసి ఆహ్వానించారు. జనసేన పార్టీలో మనుగడ లేదని, అందుకే భవిష్యత్తు ఉన్న వైఎస్సార్ సీపీలో చేరితే గుర్తింపు ఉంటుందని, అందుకే పార్టీ చేరామని గబ్బర్‌సింగ్ తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు, పార్టీ సీనియర్ నాయకుడు గొందేశి సత్యనారాయణరెడ్డి, బర్రి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చైత్ర పౌర్ణమి పూజలకు సిద్ధం

- 22న రథోత్సవం
- ప్రధాన జాతరకు ఏర్పాట్లు



సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: చైత్రమాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 22 సోమవారం సుబ్రహ్మణ్యస్వామి చైత్ర పూర్ణిమ మహోత్సవాలు కార్తికేయ శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం ఊర్వశికూడలి రవీంద్రనగర్ సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, మండపరాధన, ముత్తయిదువుల చేతులమీదుగా ఊంజల సేవ ఉంటుందన్నారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. స్వామివారిని సాయంత్రం ఊర్వశికూడలి ఆలయం నుంచి కంచరపాలెం నేతాజీ కూడలి వరకు తిరుగు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద చలివేంద్రాలు, అన్న ప్రసాద వితరణలకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్నఆందోళన

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంతో నగర పోలీస్‌కమిషనర్ డాక్టర్ రవి శంకర్ జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టు గేటు వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమం శుక్రవారానికి 10వ రోజుకు చేరుకుంది. కార్మికులు తమ కుటుంబాలతో కలసి ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు నిర్వాసితుల కమిటీ నాయకులు మాట్లాడుతూ గంగవరం పోర్టు యాజమాన్యం తీరు దారుణంగా ఉందన్నారు. తమకు వేతనాలు పెంచకపోతే వన్ టైం సెటిల్‌మెంట్ చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సీపీ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఆదారి నామినేషన్.. జనహోరు



గోపాలపట్నం నూకాలమ్మ ఆలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ఆదారి ఆనంద్ కుమార్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



జనసంద్రంగా మారిన బీఆర్‌టీఎస్ రహదారి

- భారీగా తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు
- వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఓపెన్‌టాప్ వాహనంపై ఆదారి అభివాదం
- మంచిమెజార్టీతో గెలుపు ఖాయం : రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివచ్చారు. శుక్రవారం ఉదయం గోపాలపట్నం నూకాలమ్మ ఆలయం నుంచి నుంచి మేళతాళాలతో ర్యాలీ ప్రారంభమైంది. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో రహదారులు కిటకిటలాడాయి. గోపాలపట్నం నూకాలమ్మ ఆలయంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఆదారి ఆనంద్‌కుమార్ పూజలు జరిపారు. అనంతరం నామినేషన్ పత్రాలను అమ్మవారి చెంత ఉంచారు. అనంతరం అక్కడి నుంచి ద్విచక్రవాహనాలు, కార్లతో ర్యాలీగా బయలుదేరారు.



62వ వార్డు బైక్ ర్యాలీగా వెళుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

జ్ఞానాపురంలో ఎర్నిమాంబ ఆలయంలో ఆదారి ఆనంద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు నామినేషన్ పత్రాలు అమ్మవారి చెంత ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఆదారి ఆనంద్‌కుమార్ మంచి మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

గోపాలపట్నం నుంచి ఆయనకు అడుగడుగునా ఘనంగా స్వాగతం లభించింది. 90వ వార్డు గాంధీనగర్ వద్ద, 52వ వార్డు శాంతినగర్, కరాసా బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయం వద్ద అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. మర్రిపాలెంలో 57వ వార్డు కార్యకర్తలు, కంచరపాలెంలో 56వ వార్డు కార్యకర్తలు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

మండుటెండను సైతం లెక్క చేయక..

కార్యకర్తలు ఉత్సాహం ముందు సూర్యుడు కూడా చిన్నబోయాడు. ఉదయం 7గంటల నుంచే ఎండ విజృంభించినా కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గలేదు. 9.15 గంటలకు వైవీ సుబ్బారెడ్డి, ఆదారి ఆనంద్ కుమార్ రావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. ఆదారి ఆనంద్ కుమార్ జిందాబాద్, వైవీ సుబ్బారెడ్డి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఇక్కడి నుంచి ఓపెన్ టాప్ వాహనంలో బయలుదేరగానే ద్విచక్రవాహనాలు అనుసరించాయి. కార్యక్రమంలో ఆదారి ఆనంద్‌కుమార్ సోదరి పీలా రమాకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఎన్నికల పరిశీలకులు ఎస్‌ఏ రహమాన్, పీలా ఉమారాణి, పేడాడ రమణి కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తరలివెళ్తున్న కార్యకర్తలు

నామినేషన్ పత్రాలు అందజేత

జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు అందించారు. ఆయనతో పాటు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఆదారి ఆనంద్ కుమార్ సోదరి పీలా రమాకుమారి, పీవీ సురేష్ హాజరయ్యారు.



పూజల అనంతరం నామినేషన్ పత్రాలను ఆదారి ఆనంద్‌కుమార్‌కు అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

అభిమానుల కోలాహలం

సింధియా : పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం కోసం కార్యకర్తలు కదం తొక్కారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ నామినేషన్‌కు అభిమానుల భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా 40, 62, 63వ వార్డుల నుంచి అభిమానుల బైకులతో ర్యాలీగా వెళ్లారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలోనూ, 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షులు సోమాధుల సురేష్ ఆధ్వర్యంలోనూ భారీగా కార్యకర్తలు ఆదారి నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు.

తరలివెళ్లిన పార్టీ శ్రేణులు



58వ వార్డు కార్పొరేటర్ లావణ్య ఆధ్వర్యంలో ర్యాలీకి తరలివెళుతున్న నాయకులు, కార్యకర్తలు



ఆదారి ఆనంద్‌కుమార్‌కు గజమాల వేస్తున్న 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్



జీవీఎంసీ 61వ వార్డులో ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొనేందుకు పారిశ్రామిక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో వేర్వేరుగా శుక్రవారం ఉదయం బైక్ ర్యాలీలతో తరలివెళ్లారు. అలాగే 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో నక్కవానిపాలెం, పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఇండ్రస్టియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, అమరావతి, పెంటారావు, సంపత్, రాజు, ఖాన్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. 60వ వార్డు పరిధి వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో గుల్లలపాలెం వుడాకాలనీ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, అశోక్, వర్మ, అంగ రామ్‌ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మల్కాపురం నుంచి కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బూస అప్పలరెడ్డి, వెంకటలక్ష్మి, చట్టి నూకరాజు యాదవ్, స్వప్న, మంగ తదితరులు పాల్గొన్నారు. అలాగే జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సందడే..సందడి

కంచరపాలెం: వైఎస్సార్ సీపీ విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ నామినేషన్‌కు భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. జ్ఞానాపురం కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదారి ఆనంద్‌కుమార్, ఆదారి మాలతి, సుజాతలు సారె ఊరేగించారు. ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు. అనంతరం సెయింట్ జోసెఫ్ కళాశాల నుంచి కాలినడకన జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 ఎన్నికల కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆదారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజవర్గంలో ఐదేళ్లలో అవినీతి రహిత పాలన సాగించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.

రావాలి జగన్..కావాలి జగన్ నినాదాలతో..

ఆదారి నామినేషన్ సందర్భంగా రావాలి జగన్.. కావాలి జగన్ అంటూ దారిపొడవునా పార్టీ అభిమానులు నినాదాలు చేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, పార్టీ కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చారు. యువత బైక్ ర్యాలీతో రోడ్లు దద్దరిల్లాయి. జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ మేయర్ గొలగాని హరికుమారి, పేడాడ రమణికుమారి, ఆయా వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, లావణ్య, వార్డు అధ్యక్షులు ఆదారి శ్రీనువాసరావు, గుణ్ణేశ్వరరావు, నాయకులు శ్రీదేవివర్మ, వల్లా ఎర్నికుమార్, సర్వసిద్ధి సాయిలత, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్ దంపతులు

టీడీపీ కుళ్లు రాజకీయం

- నూకాలమ్మ ఆలయం తలుపులు తెరవకుండా ఇబ్బందులు
- గోపాలపట్నంలోని ఆలయం గణబాబు బంధువులది..
- నామినేషన్ వేసే క్రమంలో పూజలు చేసేందుకు వచ్చిన ఆదారి ఆనంద్‌కుమార్, వైవీ సుబ్బారెడ్డి
- భక్తుల ఆగ్రహంతో తలుపులు తెరిచిన నిర్వాహకులు



ఆలయ ప్రాంగణంలో తాళాలు తెరవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్యకర్తలు



ఆలయం బయటే మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

గోపాలపట్నం : టీడీపీ కుళ్లు రాజకీయం మరోసారి బయటపడింది. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు బంధువులకు చెందిన గోపాలపట్నం నూకాలమ్మ ఆలయం శుక్రవారం 9 గంటల వరకు తెరవకపోవడంతో భక్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ఏడు గంటల్లోపే ఆలయాన్ని తెరుస్తారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ నామినేషన్ సందర్భంగా అమ్మవారి ఆలయంలో పూజలు చేసేందుకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో కలిసి ఆలయానికి వచ్చారు. ముందుగానే ఆలయ నిర్వాహకులు ఈ విషయం చెప్పినప్పటికీ కావాలనే టీడీపీ నేతలు ఉదయం 9 గంటల వరకూ ఆలయాన్ని తెరవకుండా ఇబ్బంది పెట్టారు. నాయకులు, కార్యకర్తలు ఫోన్లు చేసినా స్పందించలేదు.

ఓటమి భయంతోనే నీచ రాజకీయాలు : గణబాబు ఓటమి భయంతోనే కుళ్లు రాజకీయాలకు తెర తీశారని పలువురు విమర్శించారు. ఆలయం తన బంధువులది కావడంతో ఇబ్బంది పెట్టారని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు సాధారణ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఐదేళ్లు ప్రజలకు దూరంగా ఉన్న నాయకుడికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. ఆ ఓటమి భయంతోనే ఈ విధమైన పిచ్చి చర్యలు పాల్పడుతున్నాడని విమర్శించారు.

ఇబ్బందిపడ్డ భక్తులు: ఆలయ తలుపులు తెరవకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం కావడంతో మొక్కులుతీర్చుకోవడానికి భారీగానే తరలివచ్చారు. ఉదయం 9 గంటలైనా ఆలయం తెరవకపోవడంతో బయటే పూజలు చేసి వెళ్లిపోయారు. ఆలయ వేదికగా ఈ రాజకీయాలేంటని పలువురు నిర్వాహకులపై మండిపడ్డారు.

జనం ఒత్తిడితో.. : ఎన్నిసార్లు ఫోన్లు చేస్తున్నా తలుపులు తెరవక పోవడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఒకానొక సమయంలో తాళాలు బద్దలుగొట్టాలనుకున్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు భక్తులకు సర్దిచెప్పారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఆదారి ఆనంద్‌కుమార్ వచ్చే సమయానికి ఆలయ కమిటీ సభ్యురాలు వచ్చి తలుపులు తెరిచారు. దీంతో ఆలయంలో ఆదారి పూజలు చేసి నామినేషన్ వేసేందుకు తరలివెళ్లారు.

మీ అభిమానం ఇలాగే ఉండాలి



మల్కాపురం నగరాలవీధిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఆయా ఆత్మీయ సమావేశాలకు అతిథిగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్,వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని రమాకుమారి మాట్లాడుతూ నక్కవానిపాలెం ప్రాంత వాసులు తమ కుటుంబంపై చూపుతున్న ఆదరాభిమానాలకు ఎప్పుడూ కృతజ్ఞతులమై ఉంటామన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్‌పై కురిపిస్తున్న అభిమానం చూస్తుండే ఆనంద్ ఎంతో అదృష్టవంతుడిగా భావిస్తున్నానన్నారు. మీ అభిమానం ఎల్లప్పుడు ఇలాగే ఆనంద్‌పై ఉంచి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, నగరాలవీధిలో నగరాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. నగరాల కార్పొరేషన్ ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కార్పొరేట్లకే బీజేపీ మద్దతు

కూర్మన్నపాలెం: ప్రజా సమస్యలను గాలికి వదిలి, కార్పొరేట్లకు మేలు చేకూర్చేందుకే కేంద్రంలోని బీజేపీ నాయకులు ఆసక్తి చూపుతున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం ఎంతో కష్టపడిన కార్మికుల జీవితాలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

ఉత్సాహంగా ఎన్టీపీసీ గ్రామీణ క్రీడోత్సవం

అగనంపూడి: క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఏటా గ్రామీణ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఎన్టీపీసీ సారథ్యంలో పరవాడ మండల స్థాయి క్రీడాపోటీలు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడల పట్ల ఆసక్తి ఉంటుందని, క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వా రా ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రొతు నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు మెలగాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, జిల్లా పీడీ అండ్ పీఈటీల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు, ఎన్టీపీసీ డీజీఎం మహాపాత్రో, సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ శివప్రతాప్ సింగ్, మేనేజర్ ప్రకాశరావుపాల్గొన్నారు.